సాక్షి
హనుమకొండ
గురువారం । 21 । ఆగస్టు । 2025



విగ్రహాల రవాణాలో జాగ్రత్త

వినాయక విగ్రహాల తయారీ, రవాణాలో జాగ్రత్తలు తీసుకోవాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. - 8లో▸



కొనసాగుతున్న సైన్స్ కాంగ్రెస్

కేయూ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ బుధవారం ఉత్సాహంగా కొనసాగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం 31°/24°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురుస్తాయి. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.



మహాజాతరకు.. నిధుల వరద

'మేడారం-2026' నిర్వహణకు రూ.150 కోట్లు

- నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- గతేడాది రూ.110 కోట్లే
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు
- శాఖల వారీగా నిధులు కేటాయింపు
- 2026 జనవరిలో తెలంగాణ కుంభమేళా

సాక్షిప్రతినిధి, వరంగల్/ఏటూరునాగారం:

వచ్చే ఏడాది జరగనున్న తెలంగాణ కుంభమేళా, సమ్మక్క, సారలమ్మ మేడారం మహాజాతరకు భారీగా నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాజాతరకు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.150 కోట్లు మంజూరు చేస్తూ శాఖలవారీగా బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. భారీగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర

ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం జాతర ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందింది. ఈ జాతర తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. అందుకే మేడారం జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాజాతరకు తరలివచ్చే భక్తుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూనే ఉంది. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. 2026 జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజులపాటు మహాజాతర నిర్వహించనున్నారు. ఇప్పటికే సమ్మక్క-సారలమ్మ పూజారులు జాతర తేదీలను ప్రకటించారు. తొలిరోజు జనవరి 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు గద్దెపైకి చేరుకుంటారు. రెండో రోజు 29న సాయంత్రం 6 గంటలకు చిలకలగుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. మూడో రోజు జనవరి 30న సమ్మక్క సారలమ్మలను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. జనవరి 31న సాయంత్రం 6 గంటలకు సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవిందరాజు, పగిడిద్దరాజు వన ప్రవేశంతో జాతర ముగియనుంది.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తుల రాక

మేడారం జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ క్రమంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు.

గతేడాది రూ.110కోట్లు

గత ఏడాది 2024 మహాజాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.110కోట్లు మంజూరు చేసి మేడారంలో పలు అభివృద్ధి పనులు చేసింది. భక్తుల సౌకర్యాలను మరింత పెంచేందుకు ఈసారి అదనంగా రూ.40 కోట్లు పెంచి రూ.150కోట్లు చేయడం గమనార్హం. 2022లో అప్పటి ప్రభుత్వం రూ.75 కోట్లను మేడారం జాతర నిర్వహణకు మంజూరు చేసింది.





శాఖల వారీగా నిధుల కేటాయింపు వివరాలు (రూ.కోట్లలో)

పంచాయతీరాజ్	రోడ్లు, భవనాలు	ఇరిగేషన్, సీఏడీడీ	ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్	తాగునీరు, శానిటేషన్ ఆర్‌డబ్ల్యూఎస్	జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయం	అగ్నిమాపక	పశుసంవర్ధక	ఐఅండ్‌పీఆర్
51.30	9.95	5.90	8.57	15.15	11.62	0.30	0.30	0.57

వైద్య ఆరోగ్య	పోలీస్	అటవీ	స్త్రీ, శిశు సంక్షేమ	రెవెన్యూ శాఖ	మత్స్య	ఎండోమెంట్	ఎక్సైజ్‌ప్రొహిబిషన్	టూరిజం	ఎన్‌పీడీసీఎల్	టీజీ ఆర్టీసీ	గిరిజన సంక్షేమం(ఐటీడీఏ)
1.07	14.50	0.50	0.25	14.38	0.23	1.75	0.25	0.90	5	5	2.50

న్యూస్‌రీల్

నేషనల్ హైవే ఆఫీస్ ఫర్నిచర్ జప్తు చేయండి

నష్టపరిహారం చెల్లింపు కేసులో కోర్టు ఆదేశం



కాజీపేట అర్బన్ : హనుమకొండ హంటర్‌రోడ్డులోని నేషనల్ హైవే ఆఫీస్ ఫర్నిచర్ జప్తు చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జప్తు చేసేందుకు వచ్చిన కోర్టు సిబ్బందిని బుధవారం కార్యాలయ సిబ్బంది అడ్డుకున్నారు. కోర్టు సిబ్బంది కథనం ప్రకారం.. నేషనల్ హైవే 163 రోడ్డు కింద భూములు కోల్పోయిన పైడిపల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేస్తున్న నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫీస్ మూవబుల్ ప్రాపర్టీని జప్తు చేయాలని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేసేందుకు సిబ్బంది ఆఫీస్‌లోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని జప్తు చేసేందుకు వెళ్లారు. వీరిని నేషనల్ హైవే ఆఫీస్ సిబ్బంది అడ్డుకున్నట్లు తెలిపారు.

సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.వెంకన్న వీఆర్ నుంచి దేవరుప్పుల పీఎస్, జి.శ్రీదేవి తరిగొప్పుల నుంచి వరంగల్ సీసీఎస్, ఎం.రాజు గీసుకొండ నుంచి ముల్కనూరు, ఎస్.సాయిబాబు ముల్కనూరు నుంచి వర్ధన్నపేట, బి.చందర్ వర్ధన్నపేట నుంచి టాస్క్‌ఫోర్స్, జి.అనిల్‌కుమార్ వీఆర్ నుంచి గీసుకొండ, టి.విజయ్‌రాజు వీఆర్ నుంచి గీసుకొండ, ఎం.కుమారస్వామి వీఆర్ నుంచి వరంగల్ ట్రాఫిక్, ఈ.రతీశ్ వీఆర్ నుంచి సీఎస్‌బీ వరంగల్, ఆనందం వీఆర్ నుంచి సీఎస్‌బీ వరంగల్, టి.యాదగిరి వరంగల్ ట్రాఫిక్ నుంచి సీసీఎస్ వరంగల్, ఈ.నారయణ హనుమకొండ ట్రాఫిక్ నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం


వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎంపికైన 49 మంది జూనియర్ సివిల్ జడ్జిలను వివిధ జిల్లాలకు నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదుగురు జూనియర్ సివిల్ జడ్జిలను నియమించారు. వరంగల్ నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు (ఎక్సైజ్ కోర్టు) జడ్జిగా రాజ్‌నిధి, నర్సంపేట జూనియర్ సివిల్ జడ్జిగా ఊట్లూరి గిరిధర్, హనుమకొండ రెండో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు (పీసీఆర్ కోర్టు) జడ్జిగా బానావత్ అనూష, పరకాల మొదటి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టుకు బొడ్డు శ్రీవల్లి శైలజ, ములుగు మొబైల్ కోర్టు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా దక్కన్నగారి మధులిక తేజను నియమించారు. ఈనెల 28లోపు బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు.

మామునూరు భూ నిర్వాసితుల ఖాతాల్లో రూ.34.84 కోట్లు

సాక్షి, వరంగల్: మామునూరు విమానాశ్రయం భూ సేకరణలో భాగంగా కన్సెంట్ అవార్డుకు ముందుకు వచ్చిన రైతుల బ్యాంకు ఖాతాలో రూ.34,84,05,298 జమ చేసినట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద బుధవారం తెలిపారు. 48మంది రైతుల ఖాతాల్లో జమ య్యాయని పేర్కొన్నారు. ఎకరానికి రూ.1.20 కోట్ల చొప్పున 12 మంది రైతులకు, గాడేపల్లి గ్రామంలో 36 మంది రైతులకు భూ సేకరణ పరిహారం కింద డబ్బులు చెల్లించామని కలెక్టర్ వెల్లడించారు.

చలాన్లు.. చాలానే..

- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 11,71,094 పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు
- ఇందులో 10లక్షల వరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోనివే..
- నిబంధనల ఉల్లంఘనులపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో జరిమానాలు
- జమచేయకుంటే వాహనం సీజ్ చేస్తామంటున్న సీపీ



వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల సంఖ్యతోపాటు ట్రాఫిక్ ఉల్లంఘనలు ఎక్కువవుతున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడంతో పోలీసులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో జరిమానాలు విధిస్తున్నారు. ఇలా కమిషనరేట్ పరిధిలో నమోదైన ట్రాఫిక్ చలాన్లు చాంతాడంత పేరుకుపోయాయి. వాహనదారులు తర్వాత చెల్లించవచ్చు అనే ఆలోచనలో ఉండడంతో రోజురోజుకూ పెండింగ్ జరిమానాలు పెరిగిపోతున్నాయి. కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 1,27,194 వాహనాలపై మొత్తం 11,71,094 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి మొత్తం సుమారు రూ.33.28కోట్ల జరిమానాలు చెల్లించాల్సి ఉంది.

పోలీస్ కంప్యూటర్ డేటా బేస్‌లో వాహనాల వివరాలు..

పెండింగ్ చలాన్లు ఉన్న వాహనాల పూర్తి వివరాలు పోలీస్ కంప్యూటర్ డేటా బేస్‌లో నమోదు చేసినట్లు సీపీ చెబుతున్నారు. ఈ చలాన్లను క్లియర్ చేసేందుకుగాను ఇకపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నారు. తనిఖీ సమయంలో చలాన్లు గుర్తిస్తే వెంటనే జమ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం నగరంలో అన్ని కూడళ్లలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు అమర్చారు. వీటి ఆధారంగా వాహనదారుడు ప్రయాణించే మార్గంలోని పోలీస్ ట్యాబ్‌లకు సమాచారం వెళ్తుంది. అక్కడి పోలీసులు మీ వాహనాలను రోడ్డుపై నిలిపివేసి జరిమానాలు క్లియర్ చేస్తారు.

జరిమానాలు సరే.. ట్రాఫిక్ క్లియరెన్స్ ఏదీ?

వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవడం లేదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ క్రాసింగ్ ఇలా చలాన్లు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు.. రోడ్లపై ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కాజీపేట, హనుమకొండ, వరంగల్ కేంద్రాల్లోని కూడళ్లలో, హనుమకొండ బస్టాండ్ సమీపంలో ఆటోలు, ఇతర వాహనాలు ఇష్టారాజ్యంగా నిలిపి ఉంచి మిగతా వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు సిబ్బంది వాహనాలను క్రమబద్ధీకరించకుండా కెమెరా, ఫోన్‌తో వాహనదారుల ఫొటోలు తీయడంలోనే బిజీగా ఉంటున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

చలాన్లు క్లియర్ చేయకపోతే వాహనం సీజ్



పెండింగ్ చలాన్లు క్లియర్ చేయని పక్షంలో వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికమవుతున్నాయి. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో పోలీసులు జరిమానాలు విధిస్తారు. జరిమానాలు సకాలంలో చెల్లించాలి.

– వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

కుట్టు శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలి



ఆత్మకూరు: శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

కలెక్టర్ స్నేహ శబరీష్

ఆత్మకూరు/దామెర: మహిళలు కుట్టు శిక్షణలో మెళకువలు నేర్చుకోవాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు, దామెర మండల కేంద్రాల్లో బుధవారం కలెక్టర్ స్నేహ శబరీష్ మహిళా కుట్టు శిక్షణ కేంద్రాల్ని సందర్శించారు. శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి పలు సూచనలిచ్చారు. మండల మహిళా సమాఖ్య అధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు నైపుణ్య శిక్షణ అభివృద్ధి కేంద్రాన్ని మహిళలు వినియోగించుకోవాలని, కుట్టుకు సంబంధించిన మెలకువలను శిక్షణ కాలంలో నేర్చుకోవాలన్నారు. సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి అవకాశం వచ్చినా, రాకున్నా స్వయం ఉపాధి ద్వారా సొంత కాళ్ల పై నిలబడే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం ఆత్మకూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. అనంతరం దామెర సమాఖ్య భవనం ఆవరణలో మొక్క నాటారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీఓ మేన శ్రీను, సెర్ప్ అడిషనల్ డీఆర్డీఓ వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీకి టెండర్ల కిక్కు!

- వైన్స్ నిర్వాహకుల్లో టెండర్స్ ఫీవర్
- విడుదలైన జీఓ.. పెరిగిన రుసుము
- డ్రా తేదీల కోసం ఎదురుచూపులు



కాజీపేట అర్బన్: ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న ఎక్సైజ్ శాఖపై ప్రభుత్వం ప్రత్యేక నజర్ పెట్టింది. ప్రతీసారి రెండేళ్ల కాలపరిమితితో టెండర్లకు పిలుపునిస్తారు. వైన్స్ దక్కించుకునేందుకు నిర్వాహకులతో పాటు నూతనంగా మద్యం వ్యాపారంలో రాణించాలనే ఆసక్తి ఉన్న వారు పోటీ పడుతుంటారు. కాగా.. గత టెండర్లలో హనుమకొండ జిల్లా పరిధి 65 వైన్స్‌లకుగాను ప్రతీ టెండర్‌లో దరఖాస్తులు డబుల్ అయ్యాయి. ఆదాయం సైతం రెట్టింపు అయ్యింది. గత టెండర్లలో 6,002 దరఖాస్తులు రాగా.. రూ.120 కోట్ల ఆదాయం ఖజానాకు చేరింది. ఈసారి టెండర్లతో 12 వేల దరఖాస్తులు, రూ.240 కోట్ల ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

సీన్ రిపీట్ అయ్యేనా?

ఎన్నికల సమయం దగ్గరపడుతోందని గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023-25 రెండేళ్ల కాల పరిమితితో మూడు నెలల ముందుగానే టెండర్లను పిలిచింది. 2021-23కు గాను 2023 నవంబర్ వరకు వైన్స్‌కు గడువు ఉండగా.. మూడు నెలల ముందుగానే.. (ఆగస్టు)లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించింది. సెప్టెంబర్‌లో నూతన వైన్స్ నిర్వాహకుల నుంచి ముందస్తుగా రుసుం చెల్లించుకుంది. అనంతరం డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్స్ ప్రారంభమయ్యాయి. ఈసారి కూడా 2025-27 రెండేళ్ల కాలపరిమితితో వైన్స్ టెండర్ల ప్రక్రియను నిర్వహించేందుకు జీఓ నంబర్ 93ను ప్రభుత్వం విడుదల చేసింది. కాగా.. గత ఆగస్టులో మాదిరి స్థానిక ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జీఓ నంబర్ 93ను విడుదల చేయడంతో అదే సీన్ రిపీట్ అవుతుందా? అంటూ వైన్స్ నిర్వాహకులు చర్చించుకుంటున్నారు.

హనుమకొండ జిల్లా వైన్స్ (వరంగల్ అర్బన్)లో ఇలా..

హనుమకొండ	25
కాజీపేట	15
వరంగల్ అర్బన్	12
ఖిలా వరంగల్	13

ఏడాది	దరఖాస్తులు	ఆదాయం
2021-23	2,983	రూ.59 కోట్లు
2023-25	6,002	రూ.120 కోట్లు

వరంగల్ రూరల్ జిల్లాలో వైన్స్..

నర్సంపేట	25
పరకాల	22
వర్ధన్నపేట	16

2023-25లో మొత్తం దరఖాస్తులు 2,938
ఆదాయం రూ.58 కోట్లు

ఆదాయం, దరఖాస్తు రుసుము ఇలా..

వైన్స్ టెండర్లలో పాల్గొనేవారు ఇప్పటి వరకు రూ.2 లక్షలు దరఖాస్తు రుసుముగా చెల్లించేవారు. ప్రస్తుత ప్రభుత్వం అదనపు ఆదాయం కోసం దరఖాస్తు రుసుమును రూ.2 లక్షల నుంచి 3 లక్షలకు పెంచుతూ జీఓ 93ను విడుదల చేసింది. రిజర్వేషన్ ఖరారు చేసింది. గౌడ కులస్తులకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం వైన్స్‌లను కేటాయించేందుకు నిర్ణయించారు. దీంతో గత టెండర్ల కంటే పెరిగిన దరఖాస్తు రుసుముతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఎక్సైజ్ కిక్కు డబుల్ కానుంది.

తూర్పు కాంగ్రెస్‌లో మరోసారి వర్గ విభేదాలు



రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి సురేఖ, తదితరులు



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ సారయ్య, స్వర్ణ తదితరులు

- రాజీవ్‌గాంధీ జయంతి వేదికగా బహిర్గతం
- ముందుగా జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాళి
- అనంతరం వచ్చిన మంత్రి సురేఖ..
- ఆ సమయంలో ఇరువర్గాల నినాదాలు..

రామన్నపేట : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమం సందర్భంగా వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో మరోసారి వర్గవిభేదాలు బహిర్గతమయ్యాయి. వరంగల్ ఎంజీఎం జంక్షన్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించేందుకు వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే నాగరాజు తమ కార్యకర్తలతో కలిసి చేరుకున్నారు. ముందుగా స్వర్ణ, సారయ్య రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆ సమయంలోనే అక్కడికి చేరుకున్న మంత్రి కొండా సురేఖ రెండు నిమిషాల పాటు ఆగి వేరుగా విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో ఆయా నేతల అనుచరులు జై కొండా.. జై సారన్న, జై నాగరాజు అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా నినాదాలతో హోరెత్తింది. ఆ తర్వాత సారయ్య వర్గం నాయకులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

మరోసారి చర్చ..

కొన్ని రోజుల క్రితం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి.. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నేతలపై బహిరంగంగానే విమర్శలు చేయడంతో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసేందే. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యులు ఇరువర్గాల నాయకులను పిలిచి మాట్లాడి గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా ఏకతాటిపై నిలవాలని సూచించింది. వరంగల్ జిల్లాలో జరుగుతున్న రాజకీయాలను అధిష్టానంతో నిత్యం పర్యవేక్షిస్తున్న సమయంలో రాజీవ్‌గాంధీ జయంతి వేదికగా మరోసారి విబేధాలు బహిర్గతమవడం చర్చకు దారి తీసింది.

రాజీవ్‌గాంధీ తెచ్చిన రిజర్వేషన్లే నన్ను మంత్రిని చేశాయి..

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నాడు తన హయాంలో స్థానిక సంస్థల్లో ఇచ్చిన రిజర్వేషన్ల వల్లే ప్రస్తుతం తాను మంత్రిస్థాయి ఎదిగానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎంజీఎం జంక్షన్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం కేక్ కట్ చేసి మాట్లాడారు. దేశంలో పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికను జోడించాల ఆనాడు రాజీవ్‌గాంధీ ఆలోచన చేశారని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల సమయంలో రాజకీయాలు చేయడం తగ్గదంటూ కార్యకర్తలను సముదాయించారు. తాను రాకముందే పూలమాలలు వేయడం వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్



దామెరలో పోలీస్ స్టేషన్ పరిశీలిస్తున్న డీసీపీ అంకిత్‌కుమార్

దామెర: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు పరిశీలించారు. ప్రాపర్టీ రూమ్, సన్నిహిత పిటిషన్లు, క్రైమ్ ఫైల్స్, పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసుల వివరాలను ఎస్సై కొంక అశోక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. పోలీసులు ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా విధులు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నేరస్తులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించి మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి యువతలో చైతన్యం తీసుకురావాలని వెల్లడించారు. వీపీఓలు ఆయా గ్రామ ప్రజలతో సన్నిహితంగా ఉండాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే దరఖాస్తుదారులతో సోదరభావంతో మెలగాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై కొంక అశోక్, ఏఎస్సైలు యాకయ్య, రమేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమాచారం నమోదు చేయాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట: చెత్త తరలింపు వాహనాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా పరిధి రాంపూర్‌లోని డంపింగ్ యార్డ్‌ను ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యర్థాలు నిర్వహణపై అధికారులకు సూచనలిచ్చారు.

ఇందిరమ్మ ఇళ్లు, పీహెచ్‌సీ పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి మండల కేంద్రంలో బుధవారం అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి పర్యటించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధుల బారిన పడే వారికి సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అక్కడి నుంచి కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించి తహసీల్దార్ ప్రసాద్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ అనితాదేవి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

దేశంలో శాంతి, సమైఖ్యత అవసరం

● కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా



మాట్లాడుతున్న దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా

కాజీపేట రూరల్ : దేశ ప్రజలు శాంతి, సమైఖ్యతో కలిసి ఉండాలని, అందుకు కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా ఉర్సు ఉత్సవాలు దోహదపడాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నట్లు కాజీపేట దర్గా పీఠాధిపతి, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా అన్నారు. దర్గా ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా దర్గా ఉత్సవాలు ఏటా గొప్పగా జరుగుతాయన్నారు. గురువారం అర్ధరాత్రి సందల్, శుక్రవారం ఉర్సు, శనివారం జరిగే ముగింపు ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పారిస్ నుంచి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ కాజీపేట దర్గా ఉర్సు ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా కావాల్సిన ఏర్పాట్లు అందించినట్లు తెలిపారు. మాజీ కార్పొరేటర్ అబుబక్కర్ మాట్లాడుతూ కాజీపేట దర్గా ఉత్సవాలు కులమతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో జరుగుతాయన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బియాబానీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కేవలం 11 లక్షల రూ. పెట్టుబడితో ప్లాట్ కొనండి 15 సం. లలో 60 లక్షల ఆదాయం పొందండి & 15 సం.ల పాటు లగ్జరీ రిసార్ట్‌లో ఫ్రీ మెంబర్ షిప్ పొందండి. సంప్ర॥ 9014370005. [SCA25007365]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉత్సాహంగా కొనసాగుతున్న సైన్స్‌కాంగ్రెస్..



వివిధ హైస్కూళ్ల విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిట్లు



ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న డాక్టర్ ఎస్. మనోరమ



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

● ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు
● ఉమెన్స్, యంగ్ సైంటిస్ట్‌ల మీట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఉత్సాహంగా రెండు రోజు బుధవారం కొనసాగింది. 'ఇన్నోవేటివ్ స్కిల్స్ ఫర్ ఎంపవర్‌మెంట్ సైన్స్‌అండ్ టెక్నాలజీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' అనే అంశంపై కొనసాగుతోంది.

ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు..

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో భాగంగా హైస్కూల్ స్థాయి విద్యార్థులను తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు తీసుకొచ్చారు. ఆడిటోరియం వద్ద వివిధ హైస్కూళ్ల విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించగా ఆకట్టుకున్నాయి.

దృష్టికోణం మార్చే జీవనశైలి..

హైదరాబాద్ ఐఐసీటీ ప్రొఫెసర్ వర్దిరెడ్డి మనోరమ 'ఎ సోజోమ్ ది బికేమ్ ఏ వే ఆఫ్ లైఫ్' అనే అంశంపై మాట్లాడుతూ ఒక వ్యక్తి లేదా సమూహం తాత్కాలికంగా ప్రారంభించిన జీవన ప్రయాణం.. క్రమంగా వారి జీవిత విధానంగా మారిన విశేషకథనాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ ప్రయాణం సాంస్కృతిక మార్పుల వైపు దారితీసిన మార్గాన్ని వివరిస్తుందన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ సాంప్రదాయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాగా, బుధవారం మొత్తం ఇన్‌వైటెడ్ లెక్చర్లు 23, ఓరల్ ప్రజెంటేషన్లు 58, పోస్టర్ ప్రజెంటేషన్లు 40 జరిగాయి.

నేడు ముగింపు సభ

గురువారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సైన్స్‌కాంగ్రెస్ ముగింపు సభ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథులుగా కడప యోగివేమన యూనివర్సిటీ మాజీ వీసీ ఎ. రామచంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవిద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా తదితరులు పాల్గొంటారని తెలిపారు.

సమగ్రాభివృద్ధి లక్ష్యాలకు దోహదం..

సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌తో ఆకలి నిర్మూలన, ఆరోగ్యం, బాధ్యతాయుత ఉత్పత్తి, సమగ్రాభివృద్ధి లక్ష్యాలు సాధ్యమని హైదరాబాద్ జేఎన్‌టీయూ బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఉమ అన్నారు. రైస్‌లో జీనోమ్ ఎడిటింగ్ భవిష్యత్‌లో అధిక దిగుబడి వస్తుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ హైదరాబాద్‌కు చెందిన సతేంద్రకె మంగ్రోథియా అన్నారు. స్వయం నియంత్రిత రక్షణ వ్యవస్థలో జాతీయ భద్రత, ఆర్థిక దృఢత్వం, గ్లోబల్ కనెక్టివిటీ కీలకమని ఇస్రో మాజీ డైరెక్టర్ పిచ్చైమణి అన్నారు. డాక్టర్ కిరణ్ కిశోర్ 'ఎర్త్ అబ్జర్వేషన్ టూప్లానటరీ ఎక్స్‌ప్లోరేషన్ ఎ రిజిమ్ షిఫ్ట్ ఇన్‌స్పేస్ ప్రోగ్రామ్స్' అనే అంశంపై మాట్లాడారు.

యంగ్ సైంటిస్ట్‌లతో ముఖాముఖి

సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా సెనేట్ హాల్‌లో విద్యార్థులకు యంగ్‌సైంటిస్ట్‌ల మీట్ నిర్వహించారు. యంగ్‌సైంటిస్ట్ అవార్డు పొందిన రామచంద్రరావు ఎల్లా.. క్వాంటం కంప్యూటింగ్‌పై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. హైదరాబాద్ ఎన్‌జీఆర్ శాస్త్రవేత్త హర్షిత్‌రెడ్డి గంగుల అరుదైన భూకమతాల గురించి వివరించారు. వరంగల్ కేఎంసీ సైంటిస్ట్ బి.ఫణికాంత్ జోగం ప్రొటీన్ మార్పిడిపై సందేహాలను నివృత్తి చేశారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ బాధ్యులు సంజీవరెడ్డి, వడ్డె రవీందర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ అకాడమీ సైన్సెస్ అధ్యక్షుడు మోహన్‌రావు, జనరల్‌సెక్రటరీ సత్యనారాయణ, ట్రెజరర్ ఎస్‌ఎం రెడ్డి, జాయింట్ సెక్రటరీ వడ్డె రవీందర్, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు విద్యార్థులను అభినందించారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ గీతా కెవేముగంటి

సెనేట్‌హాల్‌లో ఉమెన్స్ సైంటిస్ట్ మీట్ నిర్వహించారు. హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల ప్రొఫెసర్ గీతాకె వేముగంటి.. కేన్సర్ పురోగతిలో చిన్న ఎక్స్‌ట్రాసెల్యులర్ వేసికుల్స్ పాత్రపై వివరించారు. ఈవేసికుల్స్ ఇమ్యూన్ సిస్టమ్‌ను తప్పించుకునేలా పనిచేసి కేన్సర్ సెల్స్ రక్షణ పొందేలా చేస్తాయన్నారు. కేన్సర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు.

డీఆర్‌డీఓలో పరిశోధనలకు అవకాశం



మాట్లాడుతున్న వెంకటమణి

డీఆర్‌డీఓ సైంటిస్ట్ టి. వెంకటమణి డీఆర్‌డీఓ సైన్స్‌అండ్‌టెక్నాలజీప రంగా జరుగుతున్న పరిశోధనల గురించి వివరించారు. నైపుణ్యాలు, ప్రతిభకలిగిన ఇంజనీరింగ్ విద్యార్థులకు డీఆర్‌డీఓ పరిశోధకులుగా అవకాశం కల్పిస్తామని తెలిపారు.

యూనిట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలి

● బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



టీఎల్‌ఎఫ్ యూనిట్లను పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట: పట్టణ సమాఖ్యలు ఆదాయాన్ని పెంచే యూనిట్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం భీమారంలోని కమ్యూనిటీ రిసోర్స్ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన రుద్రమదేవి టీఎల్‌ఎఫ్ నెలవారీ సమావేశానికి కమిషనర్ హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. పట్టణ సమాఖ్యలు రెగ్యులర్‌గా సమావేశాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు పొదుపులు సక్రమంగా నిర్వహించాలని, లోన్లకు సంబంధించి రీ పేమెంట్లు గడువులోగా చెల్లించాలని సూచించారు. లావాదేవీలకు చెందిన బుక్స్‌ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, నగరంలోని 13 టీఎల్‌ఎఫ్ యూనిట్లు ఉన్నట్లు, వీటికి ఆదాయం పెంచేలా ప్రతి టీఎల్‌ఎఫ్ ఒక పెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో చాలా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయని అందుకు అనుగుణంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను ప్లాన్ చేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. అనంతరం టీఎల్‌ఎఫ్ సభ్యులు కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీఎంసీలు రమేశ్, వెంకట్‌రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సకినాల రమేశ్, సునీల్, రుద్రమాదేవి పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు రజనీ, ఆర్పీలు, ఓబీలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య
● కేఎంసీ కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య కళాశాల హాస్టల్ కార్మికులు

హన్మకొండ: కాకతీయ మెడికల్ కాలేజీలోని మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లో 20 సంవత్సరాలుగా పని చేస్తున్న 86 మంది కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య అన్నారు. 8 నెలల వేతనాలు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి సుబేదారిలోని కలెక్టరేట్ వరకు, తిరిగి ఏకశిల పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఏకశిల పార్కు దీక్ష శిబిరం వద్ద సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ ఎనిమిది నెలల బకాయి వేతనాలను కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా యంత్రాంగం చొరవ చూపి సమ్మె విరమణకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుంటే, కార్మికులు వేతనాల కోసం రోడ్లెక్కితే జిల్లా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్, యూనియన్ నాయకులు అల్లం రమేశ్, రాణి, రాజకుమారి, ఎండీ అతిక్, రాము, మంద కవిత, రవి, బాబు, శశి, సుమన్, వంశీ, ప్రశాంత్, సునీత పాల్గొన్నారు.

బల్దియా అధికారుల బదిలీ

రామన్నపేట : వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్‌లో కీలక అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ సెక్రటరీ శ్రీదేవి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జోనాను హనుమకొండ మెప్మా డైరెక్టర్‌గా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న చంద్రశేఖర్‌ను బల్దియా అడిషనల్ కమిషనర్‌గా, సమ్మయ్యకు డిప్యూటీ కమిషనర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈఈ మంగీలాల్‌పై రైతుల భగ్గు..

నీరవ్వమంటే రైతులను చులకన చేస్తూ మాట్లాడారు



ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ సమీపంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

● కాళ్లు మొక్కుతామంటే నవ్వుతున్నాడు
● జనగామ, నర్మెట రహదారిపై రాస్తారోకో
● సాగుకు నీరు విడుదల చేయాలని డిమాండ్

జనగామ రూరల్ : దేవాదుల ద్వారా సాగు నీరు విడుదల చేసి చెరువులను నింపాలని ఇరిగేషన్ అధికారులను వేడుకుంటే రైతులను చులకన చేస్తూ వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఈఈ మంగీలాల్‌పై రైతులు భగ్గుమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జోరు వర్షాలు కురుస్తూ.. వాగులు, చెరువులు పొంగిపొర్లుతుంటే జనగామ మండల రైతులు మాత్రం తమకు దేవాదుల ద్వారా సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ఓబులకేశ్వాపూర్, పెద్దపహాడ్, పెద్దరామన్‌చర్ల, పసరమడ్ల, చౌదర్‌పల్లి, ఎల్లంల, పెంబర్తి, శామీర్‌పేట, సిద్దెంకి, ఎర్రగుంట తండాకు చెందిన వందలాది మంది రైతులు ఆందోళన చేపట్టారు. వారి కథనం ప్రకారం.. రెండు రోజుల క్రితం ఈఈ మంగీలాల్ వద్దకు వచ్చి కాళ్లు మొక్కుతాం సాగుకు నీరు విడుదల చేయాలని కోరితే నవ్వుతూ తమాషాగా మాట్లాడారని తెలిపారు. సుమారు 10 గ్రామాల పరిధిలో 4,500 పైగా ఎకరాల్లో వరి, 1,300 పైగా ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఒక్క చెరువులో కూడా నీరు లేదన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నేల తడవడం తప్ప కుంటలో చుక్క నీరు రాలేదన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత వరి, పత్తి పంటలను కాపాడుకునేందుకు చెరువులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో నెలరోజుల నుంచి సాగు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పది గ్రామాల రైతులు కలిసి ఈఈ వద్దకు వస్తే దిక్కున్న చోట చెప్పుకో.. అవసరమైతే మంత్రి, సీఎం వద్దకు వెళ్లండంటూ తమపై దురుసుగా ప్రవర్తించారని, ఈ విషయంపై ప్రభుత్వం విచారణ జరిపించి ఆ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తూ సెక్షన్ ఆఫీసర్‌కు వినతిపత్రి అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి రైతులను బుజ్జగించి రాస్తారోకోను విరమింపజేశారు. కాగా, ఏకంగా పది గ్రామాల రైతులు సాగునీటి కోసం ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో రైతులు జానెపల్లి జనార్దన్‌రెడ్డి, బడికె కిష్టస్వామి, ధర్మజయప్రకాశ్‌రెడ్డి, దూసరి ఉప్పలయ్య, వల్లాల మల్లేశం, కొప్పుల మధు, కొమ్ము జగదీశ్, మహేందర్ రెడ్డి, రావుల శ్రీనివాస్‌రెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు



పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారి

కాజీపేట: హనుమకొండ జిల్లా కాజీపేటలోని 63వ డివిజన్‌లో బుధవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బాపూజీనగర్, జూబ్లీమార్కెట్, విద్యానగర్ కాలనీ ప్రాంతాల్లో ఓ వీధి కుక్క ఒక్కసారిగా బాటసారులపై పడి కనిపించిన వాళ్లను కనిపించినట్లు గాయపర్చింది. ఇంట్లో ఆడుకుంటున్న రెండున్నర సంవత్సరాల బాలికను ఇష్టారీతిగా కరిచింది. వీరితో పాటు ఐదుగురు వ్యక్తులపై దాడి చేసింది. ఆ కుక్కను స్థానిక యువకులు కర్రలతో దాడిచేసి చంపేశారు. గాయపడిన బాధితులు సోమిడి అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నారు.

అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అధికారులు

హన్మకొండ అర్బన్: ఐటీఐ/అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈనెల 28 వరకు దరఖాస్తులకు చివరి తేదీ అని కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌లు వెంకటేశ్వర్లు, సక్రు, వేణు వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐలో పలు కోర్సులకు అర్హులను పేర్కొన్నారు. ప్రతీ ఐటీఐలో వివిధ కోర్సుల్లో 172 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. డీఆర్డీఓ మేన శ్రీను, ఉపాధి శిక్షణ శాఖ ఆర్డీఓ సీతారాములు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల రవాణాలో జాగ్రత్తలు తీసుకోవాలి..

● తయారీదారులు, ఉత్సవ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి
● టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: వినాయక విగ్రహాల తయారీ, రవాణాలో జాగ్రత్తలు తీసుకోవాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. విగ్రహాల తయారీదారులు, నవరాత్రి ఉత్సవ నిర్వాహకులు విద్యుత్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీ డీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డీఈ, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా గణేశ్ విగ్రహాల తరలింపు జరుగుతుందని, దీనిపై విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విగ్రహాలు తరలించే రహదారుల్లో విద్యుత్ నెట్‌వర్క్ పరంగా ఎలాంటి లోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. భక్తులు, నవరాత్రి ఉత్సవ నిర్వాహకులు మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని కోరారు. అలాగే, ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి స్తంభాలకు ఉన్న టీవీ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ తీగలు తొలగించాలని సూచించాలని ఆదేశించారు. ఆ కేబుళ్లు ప్రమాదకరంగా ఉండడంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్ లైన్ ఎక్కడైనా తెగి పడినా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే 19 12కు గాని సమీపంలోని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎం అశోక్, జీఎం సురేందర్ పాల్గొన్నారు.

విగ్రహాల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విగ్రహాల ఎత్తును బట్టి రూట్ నిర్ణయించుకోవాలి. ఒకవేళ ఎక్కడైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలపాలి.
- విద్యుత్ లైన్ల నుంచి దిగువకు కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్‌లో ప్రసరించే విద్యుత్ సరఫరా ప్రభావం, ఇండక్షన్ ఉంటుంది.
- ఎత్తైన మెటల్ విగ్రహాల తరలింపులో మరింత అప్రమత్తంగా ఉండాలి.
- మెటల్ ఫ్రేమ్‌లతో కూడిన డెకరేషన్లు వీలైనంత మేరకు తగ్గించాలి.

మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు స్తంభాలు ఎక్కొద్దు. సంస్థ సిబ్బందితోనే విద్యుత్ కనెక్షన్ పొందాలి.
- ఐఎస్ఐ మార్క్ కలిగిన ప్రామాణిక విద్యుత్ తీగలను మాత్రమే వినియోగించాలి. ఎలాంటి జాయింట్ తీగలు వినియోగం చొద్దు. తగినంత కెపాసిటీ కలిగిన ఎంసీబీ తప్పనిసరిగా వాడాలి. ఇది విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షణ ఇస్తుంది.
- మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. విద్యుత్ తీగలు, స్తంభాలు, ఇతర ప్రమాదకర విద్యుత్ పరికరాల నుంచి పిల్లలను దూరంగా ఉంచాలి.
- ఒక వేళ ఎవరికైనా విద్యుత్ షాక్ తగిలితే వారికి వెంటనే వైద్య సహాయం అందించి, ఆ ప్రమాద సమాచారాన్ని సమీపంలోని విద్యుత్ సిబ్బందికి తెలపాలి.
- విద్యుత్ వైరింగ్‌లో ఎక్కడైనా అతుకులు ఉంటే వర్షాలు కురిసిన సమయంలో తేమతో షాక్ కలిగే అవకాశముంది. అందుకే మండప నిర్వాహకులు ప్రతీ రోజు తప్పనిసరిగా వైరింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి.

చర్లపల్లి నుంచి కాజీపేట మీదుగా పలు రైళ్లు

● అక్టోబర్ 20 నుంచి 26వ తేదీ వరకు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనుల దృష్ట్యా సికింద్రాబాద్ నుంచి కాజీపేట, వరంగల్ మీదుగా విజయవాడ, ఢిల్లీ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను అక్టోబర్ 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు చర్లపల్లి నుంచి నడిపించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయించినట్లు బుధవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు.

చర్లపల్లి నుంచి వెళ్లే రైళ్ల వివరాలు

సికింద్రాబాద్-మణుగూర్ (12745) వెళ్లే డైలీ ఎక్స్‌ప్రెస్, మణుగూర్-సికింద్రాబాద్ (12746) వెళ్లే డైలీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-దర్భాంగా (17007) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, దర్భాంగా-సికింద్రాబాద్ (17008) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, ముజఫర్‌పూర్-సికింద్రాబాద్ (05293) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-ముజఫర్‌పూర్ (05294) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-సంత్రగచ్చి (07221) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి-సికింద్రాబాద్ (07222) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-ధానాపూర్ (07647) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, ధానాపూర్-సికింద్రాబాద్ (07648) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-రక్సోల్ (07051) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్, రక్సోల్-హైదరాబాద్ (07052) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఆర్‌సీఎఫ్ యూరియా వచ్చేసింది..

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ గూడ్స్ షెడ్‌కు బుధవారం ఆర్‌సీఎఫ్ యూరియా వచ్చింది. గూడ్స్‌షెడ్‌కు 1568.470 మెట్రిక్ టన్నుల యూరియా రాగా.. ఏడీలు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి ఆర్‌సీఎఫ్ కంపెనీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని ఫర్టిలైజర్ షాపులు, పీఏసీఎస్‌లకు ఆర్‌సీఎఫ్ యూరియా పంపిచనున్నట్లు అధికారులు తెలిపారు.

శివతత్వాన్ని తెలిపే అద్భుత శిల్పకళ

● తెలుగు విశ్వవిద్యాలయం వీసీ వెల్దండ నిత్యానందరావు
● వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు



వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు దంపతులకు మహదాశీర్వచనం అందజేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: శివతత్వాన్ని తెలిపేలా కాకతీయులు అద్భుత శిల్పకళా ఖండాలు నిర్మించారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. బుధవారం వేయిస్తంభాల ఆలయాన్ని వీసీ దంపతులు సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వారిని ఆలయమర్యాదలతో ఘనంగా స్వాగతించారు. వీసీ నిత్యానందరావు దంపతులు రుద్రేశ్వరస్వామికి బిల్వార్చన జరుపుకున్నారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు, మహదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ గంపా సతీశ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. అదేవిధంగా భద్రకాళి దేవాలయాన్ని వీసీ ఆచార్య నిత్యానందరావు దంపతులు సందర్శించగా.. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించుకున్నారు. వారికి అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు.

అభివృద్ధికి కృషి చేస్తా...

పరిశోధనల పరంగా జానపద గిరిజన విజ్ఞాన పీఠం అభివృద్ధికి కృషి చేస్తానని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు అన్నారు. బుధవారం వరంగల్ హంటర్‌రోడ్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. ఈమేరకు పీఠంలో ఉసిరి మొక్క నాటారు. పీఠాధిపతి వెంకన్న వీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఠం సిబ్బంది పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్

కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌ను నడిపిస్తున్నట్లు బుధవారం ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 9న సికింద్రాబాద్-బైద్యనాథ్ ధామ్ వరకు 9 రాత్రులు, 10 రోజులతో అయోధ్య కాశీ పుణ్యక్షేత్ర యాత్ర కోసం బయల్దేరుతుందని బుధవారం ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. ఈప్రయాణంలో పూరీ జగన్నాథ్ టెంపుల్, కోణార్క్ సన్ టెంపుల్, డియోఘర్ బాబా బైద్యనాథ్ ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథ ఆలయం, కారిడార్, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణదేవి ఆలయం, గంగా హారతి, అయోధ్య రామజన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమం పుణ్యక్షేత్రాల సందర్శన ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు బయల్దేరే ఈ టూరిస్ట్ ట్రైన్ కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా నడుస్తుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 97013 60701, 92810 30712, 92810 30750, 92814 95845 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.